డివిజన్ కేంద్రం.. కాగితాలకే పరిమితం!

- తిరువూరులో కార్యాలయాల ఏర్పాటులో అధికారుల ఉదాసీనత
- ప్రజలకు అందుబాటులోకి రాని ప్రభుత్వ కార్యాలయాల సేవలు
- అధికారుల ద్వంద్వ వైఖరిపై విమర్శలు





తిరువూరులో అలంకారప్రాయంగా ఉన్న విద్యా శాఖ కార్యాలయం ; తిరువూరులోని ఆర్డీఓ కార్యాలయం, సబ్ డివిజనల్ మేజిస్ట్రేట్ వారి కార్యాలయం

తిరువూరు: 2022 ఏప్రిల్‌లో ప్రభుత్వ పాలనను ప్రజలకు చేరువ చేసే ఉద్దేశంతో జిల్లాల పునర్విభజనలో భాగంగా ఏర్పాటు చేసిన తిరువూరు రెవెన్యూ డివిజన్ కేంద్రం అధికారుల ఉదాసీన వైఖరితో కాగితాలకే పరిమితమైంది. డివిజన్ కేంద్రంగా ఉన్న తిరువూరులో ఏర్పాటు చేయాల్సిన పలు ప్రభుత్వ కార్యాలయాలను ఇతర ప్రాంతాల్లో ప్రారంభిస్తూ అధికారులు ద్వంద్వ వైఖరి అవలంబించడం విమర్శలకు తావిస్తోంది. అధిక శాతం అధికారులు విజయవాడలో నివాసం ఉంటూ వారంలో 2, 3 రోజులు మాత్రమే డివిజనల్ కార్యాలయాలకు రావడంతో ఆయా కార్యాలయాల్లో పనులు జరుగక ప్రజలు రోజుల తరబడి తిరగవలసి వస్తోంది.

ప్రతిపాదనలకే పరిమితమైన కార్యాలయాలు

తిరువూరు రెవెన్యూ డివిజనల్ కేంద్రంలో పలు ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటుకు గత ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని అధికారులు అమలు చేయకపోవడంతో ప్రజల ఇబ్బందులు కొనసాగుతున్నాయి. తిరువూరు ఆర్డీఓ కార్యాలయం మాత్రమే ఇండోర్ స్టేడియంలో తాత్కాలికంగా కొనసాగుతుండగా.. ఈ కార్యాలయానికి శాశ్వత సిబ్బందిని కూడా అరకొరగా కేటాయించారు. డెప్యుటేషన్‌పైనే ఎక్కువమంది పనిచేస్తున్నారు. వైద్య, విద్యుత్, సాంఘిక సంక్షేమ శాఖల డివిజనల్ కార్యాలయాలు ఇంతవరకు ప్రారంభం కాలేదు. తిరువూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం బోర్డుకే పరిమితమైందని ఉపాధ్యాయులు విమర్శిస్తున్నారు. విజయవాడ ఎంఈఓను ఇక్కడ ఇన్‌చార్జి డీవైఈఓగా నియమించినప్పటికీ ఏనాడూ విధులకు హాజరు కాలేదని ఆరోపిస్తున్నారు.

ఇక్కడ డివిజన్.. అక్కడ కార్యాలయాలు

తిరువూరులో ఏర్పాటు చేయాల్సిన పోలీస్ సబ్ డివిజనల్ కార్యాలయం, సహాయ వెనుకబడిన తరగతుల సంక్షేమాధికారి కార్యాలయం మైలవరంలో ఏర్పాటు చేయడంతో పాలనాపరమైన గందరగోళం నెలకొంది. రవాణా శాఖ కార్యాలయం తిరువూరులో ప్రారంభించకపోవడంతో మోటారు వాహనాల యజమానులు వివిధ పనుల నిమిత్తం 100 కిలోమీటర్ల దూరంలోని గన్నవరానికి వెళ్లక తప్పట్లేదు. తిరువూరు డివిజన్ కేంద్రంలో ఉండాల్సిన కార్యాలయాలు ఏ జిల్లాలో ఉన్నాయో వెతుక్కోవలసిన పరిస్థితి నెలకొంది. జిల్లాల విభజనకు ముందు 50 కిలోమీటర్ల దూరంలోని నూజివీడులోనే అన్ని డివిజనల్ కార్యాలయాలూ ఉండటంతో తిరువూరు ప్రాంత ప్రజలకు త్వరితగతిన పనులు జరిగేవి. ఇప్పుడు తిరువూరు డివిజన్ కేంద్రంగా ఉన్నా గన్నవరం, విజయవాడ, నూజివీడు తదితర ప్రాంతాల్లో వివిధ డివిజన్ స్థాయి కార్యాలయాలకు వెళ్లడం దూరాభారమవుతోందని, తమ పని పెనం మీద నుంచి పొయ్యిలో పడిన చందంగా మారిందని పలువురు వాపోతున్నారు.

అన్ని కార్యాలయాలూ ప్రారంభించాలి



డివిజన్ కేంద్రంగా ఉన్న తిరువూరులో ప్రభుత్వ కార్యాలయాలన్నీ వెంటనే ఏర్పాటు చేయాలి. అధికారులు, సిబ్బందిని నియమించి ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆర్టీఏ, విద్య, వైద్య, సంక్షేమ, విద్యుత్ కార్యాలయాలను తిరువూరులో ఏర్పాటు చేయాలి. రవాణా శాఖ పనుల కోసం 100 కిలోమీటర్ల దూరంలోని గన్నవరానికి వెళ్లడానికి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నందున వెంటనే ఈ కార్యాలయం తిరువూరులో ప్రారంభించాలి.

– నల్లగట్ల స్వామిదాసు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, తిరువూరు

ప్రజల ఇబ్బందులు పట్టించుకోవాలి



తిరువూరులో డివిజనల్ కార్యాలయాలు ఏర్పాటైతే తమ ఇబ్బందులు తీరతాయని ప్రజలు భావించారు. రాష్ట్రంలో మారుమూల ఉన్న తిరువూరును కేవలం డివిజన్ కేంద్రంగా ప్రకటించడం కాక ప్రజలకు అవసరమైన అన్ని కార్యాలయాలూ ఇక్కడే ఏర్పాటు చేయాలి.

– కాలసాని విజయలక్ష్మి, తిరువూరు

క్లుప్తంగా

ముందస్తు జాగ్రత్తలతో వ్యాధుల నియంత్రణ



తిరువూరు: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని తిరువూరు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి రేష్మాబేగం అన్నారు. చిన్న పిల్లల్లో వచ్చే అతిసార తదితర వ్యాధులపై అవగాహన కల్పిస్తూ వైద్యారోగ్య శాఖ రూపొందించిన వాల్‌పోస్టర్లను మంగళవారం ఆవిష్కరించారు. పిల్లలకు రక్షిత మంచినీరివ్వడం, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించడం ఎంతో ముఖ్యమని, ఐదేళ్ల లోపు చిన్నారులున్న ఇళ్లల్లో తప్పక ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలని వినతి




తిరువూరు: అసైన్డ్ భూములు సాగుచేస్తున్న తమకు కూడా అన్నదాత సుఖీభవ పథకం వర్తింపజేయాలని కోరుతూ మండలంలోని గానుగపాడు శివారు పల్లెర్లమూడి గ్రామ మహిళా రైతులు మంగళవారం తిరువూరు ఆర్డీఓ, తహసీల్దారు కార్యాలయాల్లో వినతి పత్రం సమర్పించారు. తమకు ప్రభుత్వం పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేసిందని, అయితే తమకు రైతు సేవా కేంద్రంలో ఈకేవైసీ చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. గత ప్రభుత్వంలో రైతు భరోసాతో పాటు అన్ని ప్రభుత్వ పథకాలూ తమకు లభించాయని, ఇప్పుడు ఎందుకు ఆంక్షలు పెడుతున్నారో అర్థం కావడం లేదని వాపోయారు.

80 శాతం సబ్సిడీపై కిసాన్ డ్రోన్లు



తిరువూరు: వ్యవసాయ అవసరాలకు కావలసిన కిసాన్ డ్రోన్లను 80 శాతం సబ్సిడీపై సరఫరా చేస్తున్నామని తిరువూరు వ్యవసాయ సహాయ సంచాలకులు జె. కెనడీ తెలిపారు. మండలంలోని అక్కపాలెంలో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా వ్యవసాయ శాఖ ద్వారా రైతులకు అందించే సేవలపై అవగాహన సమావేశం నిర్వహించారు. వ్యవసాయంలో యాంత్రీకరణలో భాగంగా ఎరువులు, పురుగుమందుల పిచికారీకి డ్రోన్ల సేవలను వినియోగించుకోవాలని, వీటిని సబ్సిడీపై పొందదలచిన రైతులు ఐదుగురు కలిసి గ్రూపుగా ఏర్పడాలని సూచించారు. జాతీయ ఆహార భద్రతా పథకం కింద విత్తనాల సరఫరా, సబ్సిడీపై గడ్డి విత్తనాలు, పశువులకు టీకాలు, పశువుల షెడ్ల నిర్మాణం తదితర అంశాలను వివరించారు. అక్కపాలెం సర్పంచి రవికుమార్, వ్యవసాయాధికారి పద్మ, పశు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సీపీసీ కంపెనీ కార్మికుల సమ్మె నోటీసు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కార్మికుల సమస్యల పరిష్కారం కోసం జులై 9న చేపట్టనున్న సార్వత్రిక సమ్మెలో పాల్గొనేందుకు సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎస్‌కేహెచ్ శ్రీనివాస్, మండల కార్యదర్శి ఎం.మహేష్‌తో కలిసి సీపీసీ కంపెనీ కార్మికులు సంస్థ మేనేజర్ విశిశెట్టికి మంగళవారం సమ్మె నోటీసు అందజేశారు. శ్రీనివాస్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాలు రద్దు చేసి లేబర్ కోడ్స్ ప్రవేశ పెట్టడం వల్ల కార్మికులు హక్కులు కోల్పోతున్నారన్నారు. హక్కుల రక్షణ కోసం పోరాటంలో భాగంగా సార్వత్రిక సమ్మెలో పాల్గొంటామని చెప్పారు. సీపీసీ కార్మిక యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు కంతారావు, సాంబశివరావు, కోశాధికారి చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

ఇబ్రహీంపట్నం: కేతనకొండ గ్రామం వద్ద సోమవారం ద్విచక్ర వాహన ప్రమాదానికి గురైన పగడాల గిరి (35) చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతుడు గ్రామంలో దినసరి కూలీగా పనిచేస్తాడు. రోడ్డు పక్కన నడుస్తున్న క్రమంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు 108 వాహనంలో విజయవాడ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

నరసాపురంలో 'పొలం పిలుస్తోంది'



నరసాపురం(విస్సన్నపేట): రైతులు వ్యవసాయ శాఖ ఆమోదించిన వరి వంగడాలను మాత్రమే పండించాలని మండల వ్యవసాయ శాఖాధికారి రాజ్యలక్ష్మి అన్నారు. మండలంలోని నరసాపురం గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్ ప్రారంభమవుతున్న తరుణంలో రైతులకు కావాల్సిన వరి విత్తనాలు ఎంటీయూ1061, బీపీటీ 5204, ఎంటీయూ 1224, 1262 రకాలు మండలంలోని రైతు సేవా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు. అనంతరం ఏపీ సీడ్స్ రైతు సేవా కేంద్రాలకు సరఫరా చేసిన వరి విత్తనాలను పంపిణీ చేశారు. సర్పంచ్ నాగమణి, రైతులు పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలను ఆదరించాలి

ముసునూరు: ప్రత్యేక అవసరాలు గల చిన్నారుల అభివృద్ధికి ప్రజలందరి అండ, ఆదరణ అవసరమని హెచ్ఎం పి.భాస్కరరావు అన్నారు. సమగ్ర శిక్షా అభియాన్ మండల విభాగం ఆధ్వర్యంలో దివ్యాంగ బాలల తల్లిదండ్రులకు రమణక్కపేట మెయిన్ ప్రాథమిక పాఠశాల భవిత కేంద్రంలో మంగళవారం 2025–26 విద్యా సంవత్సర ప్రథమ అవగాహన సదస్సు నిర్వహించారు. దివ్యాంగ బాలల సౌకర్యాలు, వసతులు, వారి పట్ల తీసుకోవలసిన జాగ్రత్తలను వివరించారు. అనంతరం ఫిజియో థెరపిస్ట్ ప్రశాంతి ఐదుగురు దివ్యాంగ బాలలకు ఫిజియో అభ్యసనాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు సురేష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టెండర్లు వద్దు.. పంచుకోవడమే ముద్దు

రూ.20 లక్షల అంచనా పనులకు టెండర్లు నిల్



నూజివీడు పట్టణంలోని వన్‌వే రోడ్డులో పూడికతీత పనులు చేస్తున్న కూలీలు

నూజివీడు: నూజివీడు మున్సిపాలిటీ పరిధిలో టెండర్ల ప్రక్రియను అధికారులు, పాలకులు కలిసి అపహాస్యం చేస్తున్నారు. అభివృద్ధి పనులకు సంబంధించి టెండర్లు పిలవకుండానే వర్కులను పంచుకుంటున్నారు. ఇటీవల డ్రెయినేజీల్లో పూడిక తీత పనుల నిమిత్తం రూ.20 లక్షలు కేటాయించగా పూడికతీత పనుల నిర్వహణకు టెండర్లు పిలవకుండా కొందరు కాంట్రాక్టర్లు, నాయకులకు ఈ పనులను పంచి పెట్టారు. ఒక్కో పని విలువ రూ.5 లక్షలుగా కేటాయించి నలుగురికి పంచారు. అదే టెండర్లు పిలిచినట్‌లైతే 5 శాతం లెస్‌కు టెండరు వేసినా రూ.20 లక్షలకు అదే పనిని రూ.లక్షకు తక్కువకు అనగా రూ.19 లక్షలకే చేసేవారు. అంతకంటే ఎక్కువ లెస్‌కు వేస్తే మున్సిపాలిటీకి మరిన్ని నిధులు ఆదా అయ్యేవి. వర్కులను నామినేషన్ విధానంలో పంచుకోవడంపై పట్టణ ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఈ పనులు స్థానిక ప్రజాప్రతినిధులకే రావడం గమనర్హం.

తూతూమంత్రంగా పూడికతీత పనులు..

నామినేషన్‌పై పంచుకున్న డ్రెయినేజీ పూడికతీత పనులను తూతూ మంత్రంగా చేస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. కొన్ని చోట్ల డ్రెయినేజీలపై పర్మినెంట్‌గా సిమెంట్ ప్లేట్లను వేసిన చోట పూడిక తొలగించలేదు. పనులు జరుగుతుంటే పని ప్రదేశంలో అధికారులు గాని, కింది స్థాయి ఇంజినీరింగ్ సిబ్బంది గాని లేకుండానే సంబంధిత కాంట్రాక్టర్లు తమ ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నారు. అందరూ అధికార పార్టీకి చెందిన వారు కావడంతో ఇదేంటని అడిగే నాథుడే లేకుండా పోయారు.

రూ.20 లక్షల అంచనాతో చేస్తున్నారు

కౌన్సిల్ ఆమోదం మేరకు రూ.20 లక్షల అంచనాలతో పట్టణంలోని డ్రెయినేజీల్లోని పూడిక పనులను నామినేషన్ పద్ధతిపై నలుగురికి అప్పగించాం. పూడికతీత పనులు కొనసాగుతున్నాయి. పని జరిగే చోట వర్క్ ఇన్‌స్పెక్టర్లు ఉంటున్నారు. ఎక్కడైనా పూర్తిగా తీయకపోతే అక్కడ మళ్లీ తీయిస్తాం.

–వెంకట్రావు, డీఈ, నూజివీడు మున్సిపాలిటీ

మండల పరిషత్ సమావేశంలో ప్రొటోకాల్ రగడ

- ఎంపీడీఓని నిలదీసిన ప్రజాప్రతినిధులు
- రసాభాసగా సర్వసభ్య సమావేశం



ప్రొటోకాల్ అంశంపై ఎంపీడీఓను ప్రశ్నిస్తున్న తెల్లదేవరపాడు సర్పంచ్ ఉమ్మడి ప్రసాద్

జి.కొండూరు: ప్రజాప్రతినిధులుగా ఉన్న తమను ప్రొటోకాల్ మరిచి ప్రభుత్వ కార్యక్రమాలకు ఆహ్వానించకుండా అవమానిస్తున్నారని ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు ఎంపీడీఓ రామకృష్ణ నాయక్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధులుగా తమకు తెలియకుండానే అధికార పార్టీ నాయకులు సర్పంచ్‌లుగా, ఎంపీటీసీలుగా వ్యవహరిస్తూ కార్యక్రమాలను చేయడం భారత రాజ్యాంగ హక్కులను కాలరాయడమేనని ఆగ్రహం వ్యక్తంచేశారు. జి.కొండూరు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. గత సమావేశంలో తీర్మానించిన పనులే పెండింగ్‌లో ఉన్నందున కొత్త తీర్మానాలు ఏమీ చేయకుండా పనుల పురోగతి, సంక్షేమ పథకాల అమలుపై శాఖల వారీగా సమీక్షించారు. అనంతరం ప్రొటోకాల్ అంశంపై ఎంపీపీ లక్ష్మీతిరుపతమ్మ సైతం పెదవి విరిచారు. ఎంపీపీగా తనకు సైతం గౌరవం దక్కడం లేదన్నారు.

ఎస్టిమేషన్లు, వర్క్ ఆర్డర్లు లేకుండా పనులు ఎలా చేస్తారని నిలదీత

ఎస్టిమేషన్‌లు, వర్క్ ఆర్డర్లు లేకుండా గంగినేని వద్ద పులివాగు పూడిక తీత పనులను టీడీపీ నాయకుడు చేపట్టడంపై సర్పంచ్‌లు పిల్లి రామారావు, జడ రాంబాబులు ఎంపీడీఓ రామకృష్ణనాయక్‌ని ప్రశ్నించారు. తల్లికి వందనం పథకం కింద ప్రైవేటు పాఠశాలల్లో చదవుకునే విద్యార్థులకు రూ.13 వేలు జమ చేయగా ప్రభుత్వం మినహాయించిన రూ.2 వేలు ఎవరి జేబుల్లోకి వెళ్తున్నాయని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు అధికారులను ప్రశ్నించారు.

మట్టి తవ్వకాలపై ఆగ్రహం

కవులూరు చెరువులో అనుమతులు లేకుండా మట్టి తవ్వకాలు జరుగుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీ సభ్యుడు డోలా మధుబాబు ఇరిగేషన్ ఏఈని ప్రశ్నించారు. నాడు తాము ఇంటి అవసరాలకు మట్టిని తరలిస్తేనే ఊరుకోని అధికారులు నేడు మట్టి దోపిడీ జరుగుతుంటే ఎందుకు చర్యలు చేపట్టడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనితో సర్వసభ్య సమావేశం కాసేపు రసాభాసగా మారింది.

పారిశుద్ధ్యంపై దృష్టి సారించాలి

అనంతరం ఎంపీపీ వేములకొండ లక్ష్మీతిరుపతమ్మ మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలపై అధికారులు దృష్టి సారించాలని సూచించారు. రహదారులు, తాగునీటి సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని పేర్కొన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

మట్టి తవ్వకాల్లో టీడీపీ నేతల మధ్య వాగ్వాదం

- నువ్వెంత అంటే నువ్వెంత అంటూ మాటల యుద్ధం
- తవ్వకాలను అడ్డుకున్న మరో వర్గం వారు



బొర్రగూడెం చెరువు కట్ట వద్ద ట్రాక్టర్లను అడ్డుకున్న రెండో వర్గం వారు

మైలవరం: కాసులు కురిపిస్తున్న చెరువు మట్టితో గ్రామాల్లో అధికార పార్టీ నాయకుల మధ్య వివాదాలు చెలరేగుతున్నాయి. చెరువు నీది కాదు కదా పంచాయతీకి సంబంధించింది కాబట్టి మేము తవ్వుకుంటాము.. నువ్వెంత అంటే నువ్వెంత అంటూ అధికార పార్టీ నాయకులు మధ్య మాటలు పెరిగి రెండు గ్రామాల వారు రెండు వర్గాలుగా విడిపోవడంతో వివాదం ప్రారంభమైంది. మైలవరం మండలం పుల్లూరు సమీపంలోని దాసుళ్లపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న బొర్రగూడెం చెరువు వద్ద మంగళవారం ఈ ఘటన చోటుచేసుకుంది. మైలవరం మండలం చంద్రగూడెం పంచాయతీ శివారు బొర్రగూడెం చెరువు సుమారు 60 ఎకరాలు విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు కింద 250 ఎకరాలకు పైగా రైతుల పంట పొలాలు ఉన్నాయి. బొర్రగూడెం గ్రామం అధికార పార్టీకి చెందిన నాయకుడు ఒకరు గత 20 రోజులుగా చెరువు మట్టిని తవ్వి ట్రాక్టర్లలో తరలిస్తున్నాడు. ఈ నేపథ్యంలో చంద్రగూడెం గ్రామానికి చెందిన అధికార పార్టీ నాయకులు తమ పంచాయతీ పరిధిలోని చెరువు కాబట్టి మేము కూడా మట్టి తవ్వుకుంటామని మంగళవారం ట్రాక్టర్లు తీసుకువచ్చి మట్టి తోలే ప్రయత్నం చేశారు. బొర్రగూడెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, చెరువు సంఘం అధ్యక్షుడి వర్గం ట్రాక్టర్లు అడ్డుపెట్టి అడ్డుకున్నారు. దీనితో రెండు గంటల వరకు వీరి మధ్య వివాదం నడిచింది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరు వర్గాల వారిని సముదాయించి అక్కడి నుంచి పంపించి వేశారు.

సమస్యల పరిష్కారానికి సమష్టిగా పనిచేద్దాం

ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణిస్వామి



మైలవరం: గ్రామాల్లో సమస్యలు పరిష్కారం దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా పనిచేయాలని ఎంపీపీ ఇస్లావత్ ప్రసన్నరాణి పేర్కొన్నారు. మైలవరం మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీడీఓ పి. అనూరాధ ఆధ్వర్యంలో ఎంపీపీ ప్రసన్నరాణి అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ అధికారులు తప్పనిసరిగా గ్రామాల్లో ఎటువంటి కార్యక్రమాలు జరిగినా ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులకు నిధులు మంజూరుకు కృషి చేస్తానన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల శాతం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని చెప్పారు. వర్షా కాలంలో సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య శాఖాధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అనూరాధ, వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విత్తనాల కోసం రైతుల పడిగాపులు

సమయపాలన పాటించని అధికారులు



పుల్లూరు గ్రామ సచివాలయం వద్ద అధికారుల రాక కోసం ఎదురు చూస్తున్న రైతులు

మైలవరం: వరి సాగుకు రైతులు సమాయత్తమవుతున్నారు. విత్తనాల కోసం రైతు సేవా కేంద్రాలకు వెళితే సిబ్బంది సమయ పాలన పాటించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. వారి రాకకోసం నిరీక్షించాల్సి వస్తోంది. మైలవరం మండలం పుల్లూరు గ్రామంలోని గ్రామ సచివాలయం–2కు మంగళవారం తీరుబడిగా వచ్చిన వ్యవసాయ సహాయకుని పలువురు రైతులు, రైతు సంఘం నాయకులతో కలిసి సచివాలయం వద్ద కొద్ది సేపు ఘెరావ్ చేశారు. గ్రామ సచివాలయంలో వివిధ హోదాలకు చెందిన పది మంది వరకు పనిచేస్తున్నారు. వీరంతా ఉదయం 10 గంటలకు తమ విధులకు హాజరు కావాల్సి ఉంది. విద్య, సంక్షేమ అధికారి తప్ప అందరూ 11 గంటలు దాటిన తరువాత తాపీగా సచివాలయానికి రావడంతో రైతులు, రైతు సంఘం నాయకులు అధికారుల కోసం ఎదురు చూడాల్సి వచ్చింది.

విత్తనాలు కొందరికేనా?

గ్రామానికి చెందిన రైతు దేవిరెడ్డి భూపాల్‌రెడ్డి విత్తనాల కోసం అడుగుతుంటే రెండు రోజుల్లో ఇస్తామని చెప్పారని, రెండు రోజులు ఆగి వెళితే ముందుగానే బడా నాయకులకు ఇచ్చేసి అయిపోయినట్లు చెబుతున్నారని ఆరోపించారు. మరో రెండు రోజులు ఆగితే విత్తనాలు వస్తాయని చెప్పారన్నారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళితే మంగళవారం హడావుడిగా సచివాలయానికి చెరుకోవడంతో రైతులు, రైతు సంఘం నాయకులు వారిని చుట్టుముట్టి నిలదీశారు. సకాలంలో రైతులకు సేవలందించలేని ఉద్యోగులు ఎందుకని రైతు సంఘం మండల కార్యదర్శి వజ్రాల వెంకటరెడ్డి, రైతు సంఘం సభ్యులు సీహెచ్ సుబ్బారెడ్డి ప్రశ్నించారు. విత్తనాలు ఏ రోజు ఇచ్చేది ముందుగానే తెలియజేయాలని డిమాండ్ చేశారు. అధికారులు సమయానికి వచ్చి రైతుల సమస్యలు పరిష్కరించాలని నాయకులు కోరారు. గ్రామానికి చెందిన పలువురు రైతులు పాల్గొన్నారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన విద్యార్థులు

నూజివీడు: ప్రతి రోజూ యోగా చేయడం వలన సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అన్నవరం హైస్కూల్ హెచ్ఎం జి.విజయకుమారి అన్నారు. అన్నవరం హైస్కూల్‌లోని విద్యార్థులతో పీడీ పి.రవీంద్ర మంగళవారం యోగాభ్యాసం నిర్వహించారు. హెచ్ఎం మాట్లాడుతూ శారీరక శ్రమ లేకపోవడంతో రక్తపోటు, మధుమేహం, ఒబెసిటీ వంటి అనేక వ్యాధులు వస్తున్నాయన్నారు. ప్రతి ఒక్కరూ జీవన శైలి మార్చుకుని కొంత సమయం యోగా చేయాలని చెప్పారు. పీడీ రవీంద్ర మాట్లాడుతూ యోగా వలన ఒత్తిడిని తట్టుకోగలుగుతారన్నారు. యోగాను దిన చర్యలో భాగంగా చేసుకోవాలన్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీల్లో ప్రతిభ

ఆగిరిపల్లి: మండలంలోని శోభనాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రతిభ చాటారు. ఎన్టీఆర్ జిల్లా గుంటుపల్లిలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి యోగాంధ్ర పోటీల్లో శోభనాపురం పాఠశాలకు చెందిన విద్యార్థులు రాష్ట్ర స్థాయిలో ప్రథమ స్థానం సాధించారని ప్రధానోపాధ్యాయిని యామిని కృష్ణ ప్రియ తెలిపారు. వీరిని ఎంపీడీఓ భార్గవి, ఎంఈఓలు సర్వేశ్వరరావు, ఆనంద్ కుమార్ అభినందించారు.

యూపీహెచ్‌సీ వైద్యురాలిగా దీప్తి

నూజివీడు: స్థానిక కోనేరుపేటలోని పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిగా నవుడు దీప్తి బాధ్యతలు చేపట్టారు. ఏలూరు సమీపంలోని సత్రంపాడు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యురాలిగా పనిచేస్తున్న దీప్తిని నూజివీడులోని కోనేరుపేట ఆరోగ్య కేంద్రం వైద్యురాలిగా ఉన్నతాధికారులు నియమించారు. గతంలో పనిచేసిన వైద్యురాలు కొలుసు సౌమ్య ఉద్యోగానికి రిజైన్ చేయడంతో ఇక్కడ ఖాళీ ఏర్పడింది.

దోమల లార్వాను నిర్మూలిద్దాం



చాట్రాయి: వర్షా కాలంలో దోమల లార్వాను నిర్మూలించేందుకు ప్రజలు సహకరించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి విజయలక్ష్మి అన్నారు. చీపురుగూడెం, చిన్నంపేట గ్రామాల్లో దోమల లార్వా నిర్మూలన కార్యక్రమంలో మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ సీజనల్ వ్యాధులు ప్రబలకుండా కాలనీల్లో మురుగు నిల్వ ఉండకుండా జాగ్రత్త వహించారు. పాడైన పాత్రల్లో ఉన్న నీటిలో దోమలు లార్వాను విడుదల చేస్తాయని అందువలన మన పరిసర ప్రాంతాల్లో నీటి నిల్వలు లేకుండా చూసుకొని, వాటిల్లో ఎబెట్ మందును పిచికారీ చేయాలన్నారు. ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఓబిళ్లనేని సరోజని, పరసా ధనలక్ష్మి, సీహెచ్ఓ రమణ, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

కారు ఢీకొని ద్విచక్ర వాహనదారుడికి గాయాలు

కిలేశపురం(ఇబ్రహీంపట్నం): కారు ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు నుంచి ఢీకొట్టిన ఘటనలో వాహనదారుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని కిలేశపురం వద్ద 65వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లాకు చెందిన రామకృష్ణ ప్రసాద్ విజయవాడలో ఉద్యోగం చేస్తుంటాడు. వ్యక్తిగత పనులపై కంచికచర్ల వైపు వెళుతున్న క్రమంలో వెనుక వైపు నుంచి దూసుకొచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రామకృష్ణ ప్రసాద్ కాలు విరిగింది. సమాచారం అందుకున్న 108 వాహన సిబ్బంది బాధితుడిని విజయవాడ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

అడవిలో అక్రమ తవ్వకాలు



జి.కొండూరు: మండల పరిధి చెర్వుమాధవరం రెవెన్యూ పరిధిలోని గ్రంధివాని చెరువును ఆనుకొని ఉన్న అటవీ ప్రాంతంలో గత మూడు రోజులుగా గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నాయి. చెర్వుమాధవరం గ్రామంలో హిందూ శ్మశానవాటిక అభివృద్ధికి రూ.4 లక్షలు మంజూరు కాగా ఈ శ్మశానవాటిక అభివృద్ధి పేరుతో ఎటువంటి అనుమతులు పొందకుండా రేయింబవళ్లు చెరువు నుంచి గ్రావెల్ రవాణాను కొనసాగిస్తున్నారు. సమాచారం అందుకున్న జి.కొండూరు పోలీసులు సోమవారం రాత్రి నాలుగు ట్రాక్టర్లు, ఒక పొక్లెయిన్‌ను స్వాధీనం చేసుకుని చెర్వుమాధవరం గ్రామ సచివాలయం వద్దకు తరలించారు.